సాక్షి
కుమురంభీం
శనివారం । 22 । జూన్ । 2024



ఆదివాసీ భవన్‌లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



ధ్యాన ముద్రలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



యోగాసనాలు వేస్తున్న డీఈవో అశోక్, తదితరులు



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, అధికారులు

న్యూస్‌రీల్

భీం విగ్రహానికి ఎస్పీ నివాళి



భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామంలోని ఆదివాసీ ఆరాధ్య దైవం కుమురంభీం విగ్రహానికి శుక్రవారం నూతన ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పూలమాలు వేసి నివాళులర్పించారు. భీం సమాధిపై పూలు చల్లి పూజలు చేశారు. మ్యూజియాన్ని సందర్శించి దేవత, గుస్సాడీల ప్రతిమలు, ఆభరణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం కుమురంభీం మనుమడు సోనేరావును కలిసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి గ్రామానికి వచ్చిన ఎస్పీని గ్రామస్తులు సన్మానించారు. అనంతరం జైనూర్ మండలంలోని మార్లవాయిని సందర్శించి హైమన్ డార్ఫ్ దంపతుల విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట డీఎస్పీ సదయ్య, ఎస్బీ రాణాప్రతాప్, ఎస్సై గుంపుల విజయ్, ఎంపీపీ పెందోర్ మోతీరాం, నాయకులు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి తరలించొద్దని వినతి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిని తరలించొద్దని శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన ఈఎస్‌ఐ కార్పొరేషన్ ఇన్‌చార్జి రీజినల్ డైరెక్టర్ గాంగ్లెను పలు పార్టీలు, సంఘాల నాయకులు కోరారు. సీపీఐ(ఎం)తో పాటు సీఐటీయూ, ఎస్పీఎం టెన్‌మెన్ కమిటీ నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరిందనే సాకుతో ఇక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. కార్పొరేషన్ ఆస్తులు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఆస్పత్రిని తరలిస్తే రూ.కోట్ల విలువైన స్థలాలు ప్లాట్లుగా చేసి విక్రయించుకోవాలని కొంతమంది నాయకులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీతో కలిసి ఆస్పత్రితోపాటు ఆవరణలోని భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, నియోజకవర్గ ఇన్‌చార్జి ముంజం ఆనంద్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఎస్పీఎం టెన్‌మెన్ కమిటీ సభ్యులు శివకుమార్, రాజేందర్, అశోక్‌కుమార్, గౌస్, లక్ష్మణ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు తిరుపతి, సాయికృష్ణ, టీకానంద్ మాట్లాడారు. నెట్, నీట్ తదితర పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై ఎన్‌టీఏ అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌టీఏ అసమర్థతోనే పేపర్ లీకేజీ వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నామని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతుందన్నారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు సాయికుమార్, ప్రసాద్, రాహుల్, పురుషోత్తం, సుధాకర్, రోహిత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించాలి

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించాలని బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్ కోరారు. హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తూర్పు ప్రాంతంలోని ఐదు నియోజకవర్గాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. తప్పనిసరిగా ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట బీజేపీ నాయకులు పెద్దపెల్లి భీమన్న తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఆదివాసీ భవన్‌లో ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం
- ఆసనాలతో ఆకట్టుకున్న అధికారులు, విద్యార్థులు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీటీడీవో రమాదేవి, డీపీవో భిక్షపతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, గిరిజన సంక్షేమ శాఖ క్రీడాధికారి మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక వ్యాధులు దూరమవుతాయన్నారు. పతంజలి మహర్షి ప్రపంచానికి అందించిన అపురూపమైన వైద్యకానుక యోగా అని పేర్కొన్నారు. యోగా ప్రాముఖ్యతను గుర్తించి అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలు పాఠశాలల్లోనూ యోగా తరగతులు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే యోగా అలవాటు చేసుకోవడం ద్వారా అనారోగ్యం దరి చేరదన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం డీఈవో అశోక్ విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు 20 నిమిషాలపాటు యోగా చేయించాలని సూచించారు. దీని ద్వారా వారిలో మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్వో శ్రీనివాస్, హెచ్ఎం సుభాశ్, యోగా టీచర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మనకేది నైపుణ్యం..!

- ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా మారుస్తామని సీఎం ప్రకటన
- జిల్లాలో కలగానే పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల ఏర్పాటు
- అందనంత దూరంలో సాంకేతిక విద్య
- నైపుణ్యాలు లేక ఉద్యోగ సాధనలో వెనుకబడుతున్న జిల్లా విద్యార్థులు



తిర్యాణి(ఆసిఫాబాద్): ఉద్యోగాలు సాధించాలంటే సర్టిఫికెట్ ఉంటే సరిపోదని, అందుకు తగిన నైపుణ్యం ఉంటేనే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రియల్ ట్రెనింగ్ సెంటర్(ఐటీఐ) కళాశాలలను మారుతున్న కాలానికి అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. కానీ అన్ని రంగాలతోపాటు విద్యారంగంలో వెనుకబడిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటివరకు నైపుణ్యం మాట అటు ఉంచితే కనీసం సాంకేతిక విద్యావకాశాలు కూడా అందుబాటులో లేవు. కాగజ్‌నగర్ పట్టణంలో మాత్రమే ఒకే ఒక్క ప్రైవేట్ ఐటీఐ కళాశాల కొనసాగుతోంది. గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో లేకపోవడంతో సాధారణ డిగ్రీలు పూర్తి చేసి ఇతర జిల్లా విద్యార్థులతో ఉద్యోగాల సాధనలో పోటీలో వెనుకబడుతున్నారు.

సాంకేతిక రంగానిదే భవిష్యత్తు

ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ రాకతో ప్రపంచం వేగంగా మారుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆయా రంగాల్లో నైపుణ్యాలు పెంచుకునే వారికే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు దక్కుతాయి. కానీ జిల్లాలో ఆ దిశగా అడుగులు పడటం లేదు. ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ), పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా తక్కువ సమయంలోనే ఉద్యోగావకాశాలు సాధించే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్ పొందే వెసులుబాటు ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి మాత్రమే సింగరేణి కంపెనీ వేతనంతో కూడిన శిక్షణ(అప్రెంటీస్‌షిప్) ఇవ్వడానికి ముందుకు వస్తుంది. అలాగే ఆర్టీసీ వంటి ఇతర సంస్థలు కూడా ఐటీఐ సర్టిఫికెట్ ఉంటేనే అవకాశాలు కల్పిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో మాత్రమే ప్రైవేట్ ఐటీఐ కాలేజీ ఉంది. స్థానిక విద్యార్థులు ఇంజనీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ చదవాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది.

ఆసక్తి ఉన్నా.. అవకాశాలేవీ..?

2023- 24 విద్యా సంవత్సరంలో జిల్లాలో 5,000 మందికి పైగా విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. వీరందరూ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్ పూర్తి చేసిన వారిలో కూడా ఆసక్తి ఉన్నవారు సాంకేతిక కోర్సుల్లో చేరుతుంటారు. ఇటీవల నిర్వహించిన పాలిసెట్‌లోనూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. అయితే వీరికి అవకాశాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇంజనీరింగ్ కోసం జిల్లా విద్యార్థులు ఎక్కువగా కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, ఉట్నూర్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. అయితే దూరభారం, స్థానికులతో పోటీపడి సీట్లు దక్కించుకోవడంలో వెనుకబడటంతో జిల్లా విద్యార్థులకు అనుకున్నంత మేర అవకాశాలు దక్కడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాలలు ప్రారంభించాలి



విద్యారంగంలో అత్యంత వెనుబడిన జిల్లాను ముందుకెళ్లేందుకు ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచే ఇక్కడ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ప్రారంభించాలి. జిల్లాలో ఉన్నత విద్యావకాశాలు చాలా తక్కువగా ఉండటం ఆందోళనకరం. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– జగజంపుల తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

దూరప్రాంతాలకు వెళ్లాల్సిందే..



సాధారణ కోర్సులకు బదులు పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఇటీవల పాలిసెట్ రాసి మంచి ర్యాంకు సాధించా. అయితే స్థానికంగా పాలిటెక్నిక్ కళాశాల లేక దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా మళ్లీ పునరాలోచించాల్సి వస్తుంది. జిల్లాలో కాలేజీలు ఉంటే బాలికలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– సాయిసంజన, తిర్యాణి

బొగ్గు బ్లాకుల వేలం వెంటనే ఆపాలి



కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెడుతున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర ప్రభుత్వం తప్పుడు విధానాలతో చేపడుతున్న బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే ఆపాలని ఏఐటీయూసీ ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ పరిధిలోని బొగ్గు బ్లాకులు సింగరేణి సంస్థకే అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని వ్యతిరేకిస్తూ శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని, దేశంలోని బొగ్గు బ్లాకులను వేలం ద్వారా ప్రైవేట్ పరం చేస్తోందని ఆరోపించారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, దివాకర్, నాయకులు రాజ్‌కుమార్, గోపాల్, రాంకిషన్, రవి, సత్యనారాయణ, సుధీర్, టీబీజీకేఎస్ నాయకులు మారిన వెంకటేశ్వర్లు, వెంకటేశం, చంద్రశేఖర్, ఐఎన్‌టీయూసీ నాయకులు భాస్కరాచారి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీరో అటెండెన్స్



విద్యార్థులు రాక వెలవెలబోతున్న రవీంద్రనగర్- 2లోని ప్రభుత్వ పాఠశాల



రవీంద్రనగర్- 1లోని పాఠశాలకు హాజరైన ఐదుగురు విద్యార్థులు

చింతలమానెపల్లి: అధికారుల పర్యవేక్షణాలోపం, విధుల్లో నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు ఉనికి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్- 2లోని ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఒక్క విద్యార్థి కూడా హాజరు కాలేదు. ఇక్కడ రెండో తరగతిలో ఇద్దరు, మూడులో ఐదుగురు, నాలుగులో ఏడుగురు, ఐదో తరగతిలో నలుగురు విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో ఉండగా.. నాలుగు రోజులుగా పాఠశాలకు ఎవరూ హాజరు కావడం లేదు. అలాగే రవీంద్రనగర్- 1 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉండగా ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. శుక్రవారం వీరిలో కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లగా.. తాత్కాలిక సర్దుబాటులో భాగంగా బాబాపూర్ స్కూల్ ఉపాధ్యాయుడు సునీల్ పాఠశాలకు వచ్చి ఖాళీగా కూర్చుని కనిపించారు. మరో పాఠశాలలో ఏకైక ఉపాధ్యాయురాలు లక్ష్మి చిన్నారులకు పాఠాలు బోధిస్తున్నారు. బడిబాట కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించినా ప్రవేశాలు కల్పించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి

జైనూర్(ఆసిఫాబాద్): మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన జైనూర్ మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని శుక్రవారం హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు మంత్రి సీతక్కను కలిసి విన్నవించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని, మండల కేంద్రంలో బస్టాండ్, పబ్లిక్ టాయిలెట్స్, డీఎడ్ కళాశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు హాస్టల్, మోడల్ గ్రంథాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వారి వెంట నాయకులు కనక వెంకటేశ్వరరావు, కనక సుదర్శన్, శంకర్ తదితరులు ఉన్నారు.

రుణాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలి

- టీజీబీ రీజినల్ మేనేజర్ ప్రభుదాస్



మహిళా సంఘాలకు రూ.4 కోట్ల చెక్కు ఇస్తున్న రీజినల్ మేనేజర్ ప్రభుదాస్

ఆసిఫాబాద్: బ్యాంకులు అందిస్తున్న రుణాలను మహిళా సంఘాలు ఆదాయ వనరులుగా మార్చుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. మహిళా మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని టీజీబీ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సంఘాలకు రూ.4కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఉపాధి కల్పించేందుకు గ్రూపు రుణాలతోపాటు వ్యక్తిగత రుణాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు పాడి పరిశ్రమ ద్వారా గేదెలు కొనుగోలు చేసేందుకు రూ.లక్ష రుణంతోపాటు వ్యవసాయ సంబంధ రుణాలు కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు నగదుతో కాకుండా డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ప్రతిఒక్కరూ విధిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, దీనిద్వారా కుటుంబాలకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకుకు చెల్లించాల్సిన నగదు నేరుగా జమ చేయాలని, సీఏలకు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రమేశ్, ఆసిఫాబాద్, వాంకిడి బ్రాంచి మేనేజర్లు విశ్వనాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, విశ్రాంత మేనేజర్ నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: స్పోర్ట్స్ స్కూళ్లలో 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి తెలిపారు. 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఐదు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన 20 మంది బాలురు, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. జూలై 7, 8 తేదీల్లో మేడ్చల్ జిల్లా హకీంపేట స్కూల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 80080 90626 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: వర్షాకాలంలో ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాల దృష్ట్యా అధికారులు ప్రజల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, నదులు ఉప్పొంగి అకస్మాత్తుగా వరదలకు గురయ్యే గ్రామాలను గుర్తించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కంట్రోల్‌రూం అందుబాటులోకి తీసకురావాలన్నారు. ఆసిఫాబాద్ మండలం గుండి వాగు, కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వాగుపై వంతెనల స్థితిగతులను పరిశీలించాలని ఆదేశించారు. అందవెల్లి బ్రిడ్జి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. జనవాసాల్లోకి వరద రాకుండా డ్రెయినేజీల్లో పూడికతీత చేపట్టాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన గృహాల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు వర్షాకాలం సీజన్ నాలుగు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు రవాణా చేయాలన్నారు. పంట నష్టాలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి నివేదికలు రూపొందించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్ గున్యా, అతిసార, ఇతర సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వారంలో రెండు రోజులు డ్రైడే నిర్వహించాలని ఆదేశించారు. రవాణా సౌకర్యం లేని గ్రామాల్లోని గర్భిణులను ప్రాథమిక కేంద్రాల సమీపంలోని వారి బంధువుల ఇళ్లు, ఆస్పత్రుల్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై నివేదిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎంహెచ్‌వో తుకారాం, డీఈవో అశోక్, అధికారులు పాల్గొన్నారు.

జీవో నం.3 కొనసాగించాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలు వందశాతం గిరిజనులకు చెందేలా గతంలో తీసుకొచ్చిన జీవో నం.3ను కొనసాగించాలని సేవాలాల్ సేన నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల జనాభా పెరుగుతున్న దృష్ట్యా 10శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోత్ రవినాయక్, నాయకులు గజనంద్ నాయక్, రూప్‌లాల్ నాయక్, తిరుపతి, మోహన్, రోహిదాస్, నరేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైవింగ్ టెస్ట్‌లో 285 మంది ఉత్తీర్ణత

శ్రీరాంపూర్: ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్‌లో మొత్తం 285 మంది ఉత్తీర్ణత సాధించారు. కంపెనీలో ఉన్న 60 ఈపీ ఆపరేటర్ ట్రైనీ పోస్టుల కోసం అంతర్గత అభ్యర్థులతో శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో నాలుగురోజులుగా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తుండగా శుక్రవారం ముగిశాయి. ఇప్పటివరకు మొత్తం పరీక్షలకు 543మంది హాల్‌టికెట్లు పొందగా 498 మంది డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 285 మంది అర్హత సాధించి రాత పరీక్షకు ఎంపికయ్యారు. ఈ నెల 31న కొత్తగూడెంలో జరిగే రాతపరీక్షలకు వీరంతా హాజరుకానున్నారు.

స్కూటీ అదుపు తప్పి ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో గురువారం స్కూటీ అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలో మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన ఎస్‌కే జలీల్ (41) మృతి చెందినట్లు రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేటకు చెందిన జలీల్ ఈస్‌గా పీహెచ్‌సీలో ఎంఎన్‌వోగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజులాగే గురువారం విధులకు హాజరయ్యేందుకు తన సొంత స్కూటీపై లక్సెట్టిపేట నుంచి బయలుదేరాడు. మార్గమధ్యలోని రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో జలీల్ తల, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాగా, శుక్రవారం ఉదయం రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక తరలిస్తున్న లారీలు, జేసీబీ పట్టివేత



ఇసుక తరలిస్తూ పట్టుబడిన లారీలు, జేసీబీ

రెబ్బెన: మండలంలోని రాంపూర్ శివారులో గల ఓ పరిశ్రమ నుంచి అక్రమంగా ఇసుకను రెండు లారీల్లో తరలిస్తుండగా గురువారం రాత్రి గ్రామస్తులు పట్టుకుని మైనింగ్, పోలీస్ అధికారులకు అప్పగించారు. మైనింగ్ ఏడీ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. అభివృద్ధి పనుల కోసం ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా రాంపూర్ శివారులోని ఓ పరిశ్రమ నుంచి రెండు లారీల్లో ఇసుకను తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డగించి సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో రెబ్బెన పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలతో పాటు ఇసుక లోడింగ్ కోసం వినియోగించిన జేసీబీని స్వాధీనం చేసుకుని రెబ్బెన పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వాహనాలకు సంబంధించిన యజమానులు రాకపోవటంతో ఇంకా జరిమానా విధించలేదని తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాంకిడి: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో నాలుగు వరుసల జాతీయ రహదారి–363 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా లక్కడ్‌కోట్ గ్రామానికి చెందిన రాంచందర్ జంపాల్వార్ అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై వాంకిడి మండలంలోని గోయేగాం గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలోనే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో వాంకిడి వైపు నుంచి మహారాష్ట్ర వైపునకు వెళ్తున్న ఇన్నోవా కారు రాంగ్ రూట్‌లో ఎదురుగా రాంచందర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రాంచందర్‌కు తొడ, తల వెనుక భాగంలో బలమైన గాయాలయ్యాయి. గొయేగాంకు చెందిన ఓ వ్యక్తి రాంచందర్ కుమారుడికి సమాచారం అందించగా అతడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని రాజూరలోని ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా వణికి చెందిన కుందార్‌కార్ రమేశ్‌గా గుర్తించారు. రాంచందర్ కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఆయువు తీస్తున్న క్షణికావేశం

మంచిర్యాలక్రైం: దేవుడు సృష్టించిన సమస్త ప్రాణకోటిలో తెలివైన ప్రాణి అంటే మానవుడే. అత్యంత పిరికి తనంతో ప్రతీ చిన్న విషయానికీ ఆత్మహత్య చేసుకునే ఏకైక ప్రాణి కూడా మనిషే. ఎంతటి గాయమైనా.. నెత్తురు కారుతున్నా.. చా వు వెనకాల తరుముతున్నా బతకాలనే ఆశతో తప్పించుకోగలను అనే నమ్మకంతో అడవిలోని చిన్నచిన్న జంతువులు సమస్యలతో పోరాటం చేస్తుంటే... మానవులు మాత్రం చిన్న చిన్న సమస్యలకే తమ ఆయువును వదులుకుంటున్నారు. సమస్యల సుడిగుండం నుంచి బయటపడలేననే అపనమ్మకం, బతుకు మీద భయంతో అవివేకంతో ఊపిరి వదులుతున్నారు. ఇలాంటివారు ఒక్క క్షణం ఆలోచించాలి. ఆత్మహత్య చేసుకోవడానికి ఎంత ధైర్యం చేస్తున్నారో.. బతకడానికి అందులో ఆవగింజంత ధైర్యం చేస్తే చాలు బతికిపోతారు. కారణాలేవైనా సరే సమస్యలపై సమరం చేయాలి. ప్రతీ ప్రాణికి కష్టాలుంటాయనే నిజాన్ని గ్రహించాలి. కష్టాల కడలిని దాటి ముందుకు వెళ్తేనే విజయం వరిస్తుందని గుర్తించాలి. జిల్లాలో 2023 నుంచి 2024 జూన్ వరకు 357 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో 33 శాతం వరకట్నం, 31శాతం భార్యాభర్తల మధ్య అనుమానం, 26శాతం వివాహేతర సంబంధాలు, 5శాతం కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, 5శాతం ఇతర కారణాలతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఆత్మహత్యల నివారణపై ప్రత్యేక కథనం..

- కలకలం రేపుతున్న వరుస బలవన్మరణాలు
- బతికి సాధించాలంటున్న మానసిక వైద్యనిపుణులు



రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య

మన దేశంలో రోజురోజుకూ ఆత్మహత్యల సంఖ్య పెరుగుతూనే ఉంది. మానసిక కుంగుబాటుతోనే ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతీ సంవత్సరం మన దేశంలో 10లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. రోజుకు ప్రపంచ వ్యాప్తంగా 3వేల మంది బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ప్రతీ 40 సెకన్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. పంట దిగుబడి రాలేదని రైతు, పరీక్షల్లో ఫెయిలయ్యానని విద్యార్థి, ప్రేమలో ఓడిపోయానని మరొకరు, ఆరోగ్యం బాగా లేక ఇంకొకరు, ఉద్యోగం రాలేదని ఒకరు, భార్యాభర్తల మధ్య గొడవలు, వరకట్నం వేధింపులతో ఒకరు, అప్పుల బాధతో కొందరు, మద్యం మత్తులో గొడవలతో కొందరు, అలాగే ఒంటరిగా జీవించే వారు, జీవిత భాగస్వామిని కోల్పోయిన వారు.. లేదా విడాకులు తీసుకున్నవారు, ఇతర శారీరక, మానసిక బాధలతో బాధపడుతున్న వారు.. దీర్ఘకాలిక వ్యాధులు కలిగినవారు.. బలవన్మరణానికి పాల్పడుతున్నారు. వీరంతా ఆత్మహత్య చేసుకునేముందు ఒక్క క్షణం ఆలోచిస్తే జీవితాంతం ఆనందంగా గడపవచ్చు.

ఎక్కువగా ఎవరంటే..

మగవాళ్ల కంటే ఎక్కువగా మహిళలే ఆత్మహత్య చేసుకుంటున్నారు. యవ్వనస్తులు, నడి వయస్సు దాటినవారు, ఈ మధ్య కాలంలో 15నుంచి40 ఏళ్ల వారు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఒక్కసారి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన మెదడులో ఉత్పన్నమైందంటే ఏదో ఒకరోజు ఆచరిస్తారు. ఇలాంటివారిని కనిపెడుతూ ఉండాలి. ఒంటరిగా ఉండకుండా చూసుకోవాలి. స్నేహితులు, కుటుంబ సభ్యులు వారిని కనిపెడుతూ ఉండాలి.

వీరిని ఆదర్శంగా తీసుకుందాం..

ఎందరో మహానుభావులు.. ఎన్నో ఓటములు చవిచూసి ఓటమి నేర్పిన పాఠాలు నేర్చుకుని ఎన్నో విజయాలు సాధించారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటే విజయం మీ సొంతమవుతుంది.

- **అబ్రహం లింకన్:** ఇతను రెండుసార్లు వ్యాపారంలో తీవ్రంగా నష్టపోయారు. శాసనసభ ఎన్నికల్లో ఐదుసార్లు ఓటమి పాలయ్యారు. 26 ఏళ్ల వయసులోనే భార్య మరణించింది. 27 ఏళ్ల వయసులో తీవ్రమైన నాడి రుగ్మతకు గురయ్యారు. అయినా ఎప్పుడూ కుంగిపోలేదు. 52 ఏళ్ల వయసులో అమెరికా అధ్యక్షుడయ్యారు.
- **థామస్ అల్వా ఎడిసన్:** కేవలం మూడు నెలల పాఠశాల అనుభవం ఉంది. ఇతడికి పాక్షిక చెవుడు. రూ.కోట్ల విలువైన ఫ్యాక్టరీ అగ్నికి ఆహుతైంది. మొదటి బల్బు తయారీ ప్రక్రియలో 10వేల సార్లకు పైగా విఫలమయ్యారు. అయినా అధైర్యపడలేదు. చివరకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శాస్త్రవేత్తగా ఎదిగారు.
- **అమితా బచ్చన్:** రేడియో వ్యాఖ్యాత ఇంటర్వ్యూలో విఫలమయ్యారు. అతడి గొంతు రేడియోకి పనికి రాదని అవమానించారు. ఆ తర్వాత నటనారంగంలో ఖ్యాతి గడించారు.
- **సచిన్ టెండూల్కర్:** పదో తరగతి ఫెయిలయ్యారు. ఆయనకు క్రికెట్‌లో ఉన్న ప్రతిభతో ఆకాశమంత ఎత్తుకు ఎదిగారు.

ఇటీవలి ఘటనల్లో కొన్ని..

- హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన గోనె రమ్య (28) ఎనిమిదేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన శేఖర్‌ను ప్రేమ వివా హం చేసుకుంది. ఇద్దరు మంచిర్యాలలోని ఓ రెస్టారెంట్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నారు. శేఖర్ ఇటీవల మద్యానికి, పేకాటకు బానిసయ్యాడు. పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో ఇద్దరి మధ్య కలహాలు ప్రారంభమయ్యా యి. ఈక్రమంలో తరచూ కట్నం తేవాలంటూ రమ్యను వేధించాడు. అక్రమ సంబంధం అంటగడుతూ మద్యం మత్తులో చేయిచేసుకునే వాడు. భర్త వేధింపులు భరించలేక తల్లిగారింటికి వెళ్లి విషయం తెలిపింది. జరి గిన అవమానాన్ని భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన జంజిరాల స్నేహశీల (36) మందమర్రికి చెందిన మహేశ్‌ను ప్రేమవివాహం చేసుకుంది. వివాహమైన ఏడాది నుంచే భర్త నుంచి వేధింపులు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక, కన్న వాళ్లకు చెప్పుకోలేక 13 ఏళ్లు భరించింది. ఇద్దరు కుమార్తెలకు జన్మనిచ్చింది. స్నేహశీల లక్సెట్టిపేటలోని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తుండేది. మహేశ్ జులాయిగా తిరుగుతూ పేకాట, మద్యానికి బానిసయ్యాడు. అదనపు కట్నం తేవాలని భార్యను వేధిస్తూ తరచూ కొడుతుండేవాడు. భర్త వేధింపులు భరించలేక ఈ నెల 16న స్నేహశీల ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- ఈ నెల 20న నస్పూర్ మండలం సంఘమల్లయ్య పల్లెకు చెందిన రెడ్డి శ్రీనివాస్–అనూష దంపతుల కుమారుడు సాయిచరణ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. అతడిని పుస్తకాలు ఎక్కడ పడేసుకున్నావని తండ్రి మందలించగా క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆత్మస్థైర్యం నింపాలి



ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఒంటరిగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. కొందరు మద్యానికి బానిసలవుతారు. ఇంట్లో ఎవరితోనూ మాట్లాడారు. ప్రతీ చిన్న విషయానికి చిరాకు పడుతుంటారు. ఈ లక్షణాలు కలిగిన వారిలో చాలా మంది ఆత్మహత్యకు పాల్పడతారు. వీరిని మొదట గమనించాలి. జీవితంలో విజయాలు సాధించిన వారి కథలు చెబుతూ వీరిలో ఆత్మస్థైర్యం నింపాలి. అయినా మార్పు రాకుంటే మానసిక వైద్యనిపుణులకు చూపించాలి.

– విశ్వేశ్వర్‌రావ్, మానసిక వైద్యనిపుణుడు, మంచిర్యాల

బతికి సాధించాలి



ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. చిన్నపాటి సమస్యలకు మానసికంగా కుంగి ఆత్మహత్యకు పాల్పడవద్దు. అండగా కట్టుకున్నవారు, కన్నవారు, స్నేహితులుంటారు. అన్నింటికీ మించి మనల్ని సృష్టించిన ఆ భగవంతుడున్నాడన్న నమ్మకంతో పట్టుదలతో పోరాడాలి. ధైర్యంగా నిలబడాలి. మనిషి నిత్య విద్యార్థి. ఓటమి వెనుక విజయం ఉందని గ్రహించాలి. అప్పుడే విజయం నీ సొంతమవుతుంది.

– బన్సీలాల్, సీఐ, మంచిర్యాల

సింగరేణి ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించాలి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి బొగ్గు గనుల్లో విషవాయువుల మధ్య అలుపెరుగని శ్రమ చేస్తూ అనారోగ్యం బారిన పడిన కార్మికులు సింగరేణి ఆస్పత్రులకు వెళ్తే వైద్యం అందని ద్రాక్షగా మారిందని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం పత్రికలకు విడుదల చేసిన లేఖలో ఆరోపించారు. కొన్ని సింగరేణి ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుబాటులో లేవని తెలిపారు. ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలు కూడా పని చేయడం లేదని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది కొరతతో కార్మిక కుటుంబాలకు వైద్యసేవలు అందడం లేదని తెలిపారు. ఏటా రూ.వేల కోట్ల లాభాల్లో ఉన్న సంస్థ రోగులకు అరకొర వైద్యం, నాసిరకం మందులు అంటగడుతోందని ఆరోపించారు. భూపాలపల్లి, గోదావరిఖని, రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది వైద్యం కోసం వచ్చే సింగరేణి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వైద్య సిబ్బందితో అవమానకరంగా వ్యవహరిస్తూ ఆస్పత్రి సిబ్బందిని కూడా వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణి ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యమైన మందులు సిద్ధంగా ఉంచాలని, కార్మికులపై వివక్ష చూపకుండా మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని డిమాండ్ చేశారు.

లైంగికదాడికి యత్నించిన ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: లైంగికదాడికి యత్నించిన కేసులో ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన చునార్కర్ ముకుందరావుకు 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ శుక్రవారం తీర్పు చెప్పారు. సీఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన వివాహితను వరుసకు మామ అయిన చునార్కర్ ముకుందరావు చేను పని మీద వెళ్లి ప్రతీసారి తన కోరిక తీర్చమని వెంటపడ్డాడు. సదరు మహిళ నిరాకరించగా వేరే వాళ్లతో అక్రమ సంబంధముందని నానా బూతులు తిడుతూ దుష్ప్రచారం చేశాడు. ఈ క్రమంలో 2021 జనవరి ఒకటిన రాత్రి ఏడు గంటల ప్రాంతంలో భర్త లేని సమయంలో సదరు మహిళ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన ముకుందరావు ఆమె చేయి పట్టిలాగాడు. లైంగికదాడికి యత్నిస్తుండగా అదే సమయానికి ఆమె భర్త రావడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రాజేశ్వర్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి పైతీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పీపీ జగన్మోహన్ రావు వాదించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సీఐ సతీశ్, ఎస్సై రాజేశ్వర్, కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్, సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.


యోగాను జీవితంలో భాగంగా మార్చుకోవాలి



యోగాసనాలు వేస్తున్న అధికారులు, ఉద్యోగులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగంగా మార్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ సూచించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులతో కలిసి ఆసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరంతర యోగా సాధనతో అనేక శారీరక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. యోగా సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యోగా శిక్షణ ఇస్తోందని తెలిపారు. యోగా శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మి, చొక్కయ్య ఆసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఏజీఎం తిరుమల్‌రావు, సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు రమేశ్, డీజీఎం రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, సివిల్ ఎస్ఈ భాషా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సెయింట్ ఆగ్నేశ్ పాఠశాలలో శుక్రవారం ఇంటర్నేషనల్ యోగా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని, సెక్యూరిటీ విభాగాల గైర్హాజరు ఉద్యోగులకు శుక్రవారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియా ఎస్వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉద్యోగులు గైర్హాజరు కావడానికి గల కారణాలు తెలుసుకున్నారు. నిర్ణీత మస్టర్లు లేకుంటే ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక నుంచి సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, అధికారులు రాజేశ్, పాలకుర్తి రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్మ కార్యక్రమానికి వచ్చి..

- గోదావరిలో మునిగి యువకుడి మృతి



గాలింపు చర్యల్లో ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి చెందిన చింతకింది ఉదయ్‌కుమార్ (23) అనే ఆటో డ్రైవర్ శుక్రవారం గోదావరిలో నీటి మునిగి చనిపోయాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆకెనపల్లికి చెందిన ఉదయ్‌కుమార్ తన స్నేహితుడు వెంకటేశ్ తల్లి మూడు నెలల కర్మ కార్యక్రమానికి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ముల్కల్ల గోదావరికి ఆటోలో వచ్చాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం గోదావరిలోకి స్నానాలకు చేసేందుకు వెళ్లారు. నలుగురు స్నేహితుల్లో ఉదయ్‌కుమార్ గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. తోటి స్నేహితుడు గోదావరిలో తమ కళ్ల ముందే గల్లంతు కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ ఘటనా స్థలానికి చేరుకుని ఉదయ్‌కుమార్ కోసం దాదాపు గంట పాటు గాలింపు చర్యలు చేపట్టగా చివరకు అతడి మృతదేహం లభించింది. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బొగ్గు బ్లాక్‌ల వేలంపై భగ్గుమన్న కార్మికులు



ర్యాలీ తీస్తున్న నాయకులు, కార్మికులు

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సింగరేణి కార్మికులు భగ్గున మండారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా శాంతిఖని గని కార్మికులు, ఏఐటీయూసీ శ్రేణులు గని ఆవరణలో నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. జాతీయ సంపద పేరుతో బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ పరం చేయడానికి కంకణం కట్టుకుందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి బడా పెట్టుబడిదారులపై ఉన్న ప్రేమ కార్మికులపై లేదని విమర్శించారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణికి భవిష్యత్‌లో బొగ్గుబ్లాక్‌లు దక్కకుండా చేయాలనే కుటిల బుద్ధితో వేలం వేయడానికి సిద్ధపడిందని ఆరోపించారు. ఈ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. భేషరతుగా తన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి డీ తిరుపతిగౌడ్, గని అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మంతెన రమేశ్, నాయకులు బొంకూరి రాంచందర్, ఆర్.ప్రవీణ్, పీ సురేశ్, డీ రమేశ్, రామకృష్ణ, ఎస్.శ్రీనివాస్, ఎం.రమేశ్, భాస్కర్, హరిబాబు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య మాట్లాడారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన 10 రోజుల్లోనే సింగరేణి ప్రాంతానికి చెందిన బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేయడానికి వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రాంతాల్లోని బొగ్గు నిక్షేపాలను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడంలో భాగంగానే వేలం పెడుతోందని ఆరోపించారు. దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఉనికికే ప్రశ్నార్థకం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని విమర్శించారు. దీనిని కార్మిక వర్గం ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య, నాయకులు రాచర్ల చంద్రమోహన్, ప్రసాద్ రెడ్డి, సారయ్య, మోతె లచ్చన్న, రాజయ్య, గొల్లపల్లి రామచందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ వ్యాగన్‌లో బియ్యం చోరీ

- నిందితులను పట్టుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు



ఆర్‌పీఎఫ్ పోలీసుల అదుపులో నిందితులు, ఆటోలు

మంచిర్యాలక్రైం: ఎఫ్‌సీఐ బియ్యం లోడ్‌తో స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలు వ్యాగన్‌లో నుంచి ఈ నెల 20న 23 బియ్యం బస్తాలను దొంగిలించిన ముఠాను రామగుండం ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాము నుంచి మహారాష్ట్రలోని రత్నగిరికి తరలించేందుకు గూడ్స్ రైలు వ్యాగన్‌లో బియ్యం లోడ్ చేసుకుని వెళ్లేందుకు సిద్ధంగా ఉంది. గమనించిన ఓ దొంగల ముఠా ఈ నెల 20న రాత్రి పథకం ప్రకారం గూడ్స్ వ్యాగన్ తలుపులు తెరిచి 23 బియ్యం బస్తాలు దొంగిలించారు. దొంగతనం జరిగిన విషయంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు రంగంలోకి దిగి చోరీకి పాల్పడిన వారి కోసం గాలించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల ఆచూకీ కనుగొన్నారు. వీరిలో స్థానిక గోపాల్‌వాడలో నివాసముంటున్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జిల్లా తిర్యాణికి చెందిన గుమ్ముల భీమయ్య, స్థానిక సాయికుంటకు చెందిన జనగామ దినేశ్, మందమర్రి మండలం తిమ్మాపూర్‌కు చెందిన కున్సోత్ వెంకటేశ్, తిలక్‌నగర్‌కు చెందిన అన్నెల వంశీని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. భీమయ్య ఇంట్లో దాచిన బియ్యం బస్తాలతోపాటు చోరీకి ఉపయోగించిన రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నామని ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. నిందితులను కాజీపేటలోని రైల్వే కోర్టులో రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. చోరీ జరిగిన 20గంటలు గడవక ముందే నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఏఎస్సై శేఖర్‌రెడ్డి, ఐలయ్య, సుమన్‌ను ఆర్‌పీఎఫ్ అధికారులు అభినందించారు.